కవితా కౌముది

# గరిక చేసే గాయం

సురేష్ రావి

దీప్త నీలాల కాలం తలుపెప్పుడు తడుతుందోనని
తమో ముద్రలేసుకుంటూ వస్తున్న నిమిషాల లోతుల్లోకి చూస్తున్నప్పుడు
గాలి అలలలో  ఈదులాడుతున్న అలజడిని
ఎవరో గుండెలోకి పోతపోస్తున్న చప్పుడవుతుంటే
మౌనమంతా మైదానంలో కరిగిపోయి
రక్త నీలపు సంధ్యారాగమంతా  కంటిమాపుల్లో కంపనమవుతుంది

గరిక వేటుకి గాయపడి నెత్తుటి పారాణి అద్దుకున్న పసిపాదాల క్రింద
నలిగిపోయిన పచ్చదనాల లెక్కలేస్తూ
స్మృతినిండా మృతి చెందిన క్షణాల కూడికలేసుకుంటూ
ఉచ్ఛ్వాస నిశ్వాసల గణనల్లో లోకాన్ని బేరీజవేస్తూ
గాంధారిత్వపు చూపులతో నిజాలని తూద్దామనుకుంటే
మొలిచేవన్నీ తిమిరాన్ని పండించే చీకటి విత్తనాలే

గాలిలో వేలాడుతున్న నల్లమబ్బులని చప్పరించి దాహం తీర్చేసుకుందామని
రెక్కలని చాపుకుంటూ ఎగురుతున్న తెల్లపావురపు ఆశలో భ్రమనే  చూస్తే...
ఆశావాదానికి ప్రతీకలంటూ ఏ మెలకువలోనూ రాయబడి ఉండవు!!
కాటుకని కప్పుకున్న పసిడి కిరణాలే ముంగిట్లోకి వస్తూ
ఉన్న ఒక్క జీవిత కాలమూ జీవన్మృతమై సాగిపోతూనే ఉంటుంది...
మోటబావి నెర్రెల్లోనూ చిగురించే రావి మొక్కకున్న పట్టుదలనూ నేర్వక!!

ఇంత తెలిసాక...
జన్మల క్రితమే వలసబోయిన నవ్వులను ఈ బ్రతుకులకి ఆశబెట్టడమంటే...
నిజాన్ని ఏ మడతల్లోనో దాపెట్టి అబద్ధానికి ఆడంబరమద్దటమే!!!

★★★★

# మస్టర్డ్ జయశ్రీ మువ్వా

ఒక చినుకు సన్నగా జారి కుడి కంటి కింద తడిగా తగిలితే..
ఇవాళ పదకొండో సారి కదూ నిన్ను తలుచుకోవడం

హుమ్మ్.. నాలుగు వేళ్ళ చివరలతో మెడమీద వెచ్చగా అద్దుకుంటూ అటుగా..

అపుడే చలికి వణుకుతూచెట్టు కొమ్మ నుంచి
స్లోమోషన్ లో రాలిపడే ఆకుని చూస్తూ కాసేపు,
పాజ్ అయిపోయిన ఫీల్,
ఒక్కోసారి లేనితనాన్ని ఆస్వాదించడం భలేగా వుంటుంది
వెంటనే ..వారగా తలుపు గడి వేసుకుంటా

చిందరగా వున్న కప్బోర్డ్ లో బట్టలు సర్దుతుంటే
వెనక వెన్నులోంచి జలదరింపు..
బైట కురిసే వానకి కాదు
ఆకుపచ్చ రంగు చీర మడత చెదిరి ఒళ్ళంతా చుట్టుకుంటావు ఎంతకని వద్దు అనుకోను..?

హేయ్ చెవి తమ్మెకి వ్రూగే ఝుంకీ లా ఏంటీ రొద?
అంటూ చకచకా అక్కడినుంచి వెళ్ళేప్పుడు కాలిమడమ మడత పడితే,
కన్నీటి చుక్క ఒకటి పై పెదవి పుట్టుమచ్చని హత్తుకుంటే
పద్నాలుగో సారి కదూ మళ్ళీ గుర్తొస్తావు

స్టవ్ మీద మరిగే టీ వాసన
అబ్బా... పంచదార ఎక్కువైంది నాలుక తెగిపడేలా
ప్రేమ కూడా తీపి లాగే .. ఎక్కువైతే తట్టుకోలేను
కప్పు టీ లా విసిరికొట్టలేను

కాసేపటికి,
కిటికీ బైట వాన ఆగి చూస్తుంది
నా లోపల వెలిసిపోతున్న నీటి చారికలని
చేదుని కడిగే వానో... నువ్వో... వానలా నువ్వో.. ఒకసారి వస్తే బావుండు.

★★★

# ఎందుకలా ?

ఎస్.నరేశ్ చారి

ఎందుకలా...!
నీ శక్తి సామర్థ్యాలకు
నిరాశల సంకెళ్ళు వేసి
నిలువునా బంధిస్తావు

ఎందుకలా...!
నీలోని సృజన కపోతాలను
విమర్శకుల వేటగాళ్ళకు భయపడి
పిరికితనపు పంజరంలో
వీరునిలా బంధిస్తావు

ఎందుకలా....!
నీలోని యుద్ధ వీరుడిని
పోరాటం సలపనీయకుండా
సోమరితనపు వలవేసి
జీవితకాలపు ఖైదీని చేస్తావు

ఎందుకలా..!
నిరాశపు సామ్రాజ్యానికి
మకుటంలేని మహారాజులా
అద్వితీయంగా వెలగాలని
పదే పదే ప్రయత్నిస్తావు

ఎందుకలా...!
అవకాశాల ప్రవాహానికి
నిరుత్సాహపు అడ్డుకట్టలేసి
జీవితపు ఓదార్పుతడి
నాకేమీ తగల్లేదని
కన్నీటిసంద్రంలో మునకేస్తావు

ఎందుకలా...!
సుదూరపు స్వప్నాలను
పదేపదే తలచుకుంటూ
ప్రయత్నపు తొలి అడుగులకు
నిరాశల ముళ్ళను
దారిపొడవునా నాటుతావు

ఎందుకలా...!
నీలోని జిజ్ఞాసిని
వ్యాపకాల ఈటెలతో
వాయిదాల కత్తులతో
నిర్దాక్షిణ్యంగా ఖూనీచేస్తావు

ఎందుకలా...!
కాలపు దండయాత్రకు
నిర్దాక్షిణ్యంగా తెగిపడిన
గంటల తలలను లెక్కిస్తూ
పదేపదే దుఃఖిస్తావు

ఎందుకలా...!
హేళనల నేలమాళిగల్లో
కూరుకుపోయిన
నీ పౌరుషపు దేహాన్ని చూసి
పదేపదే జాలిపడతావు

ఎందుకలా...!
ఆత్మవిశ్వాసపు ఆయుధాన్ని
బలంగా ప్రయోగించకుండా
నీలోనే దాచుకుని
ఓటమి రక్కసికి
తల వంచి దాసోహమంటావు

ఎందుకలా...!
విజయ దుందుభి మ్రోగించకుండానే
కీర్తి శిఖరాలను అధిరోహించకుండానే
కాలం విసిరే సమస్యల రాళ్లతో
నీ సమాధిని నువ్వే నిర్మించుకుంటావు

★★★

## అపరిచితులమౌదామా.!?
## రవి కిషోర్ పెంట్రాల

ఇంకోసారి..మళ్ళీ ఇంకోసారి
అపరిచితులం అవుదామా
నేనెవ్వరో నీకస్సలు తెలీదు
నాకేమో నీ పరిచయమే లేదన్నట్టు....!
జతగా ఎన్ని ఊహల పల్లకీల్లో ఊరేగాం
ఆశల నిచ్చెనలెన్ని ఆకాశాలకేసుకున్నాం
కూల్చలేని గాలి మేడలెన్ని కట్టుకున్నాం
ఉప్పెనల ఆటుపోట్లనెన్ని తట్టుకున్నాం....!
నిన్నలా మొన్నలా ఇప్పుడున్నూ
నేనెప్పుడూ మొర పెడుతున్నట్టు
కోరుకున్న గమ్యమోవైపు కవ్విస్తుంటే
వెడుతున్న బ్రతుకు దారింకోవైపు సోలుతూ..!
కాలం గాలానికి చిక్కిన చేపల్లె అల్లాడుతుంటే
ఇప్పుడైతే నను వలిచి వరించేవో లేదో
అయినా నేనంత ఆత్రంగా అప్పటిలా
మళ్ళీ నిను సాదరంగా ఆహ్వానించేనో లేనో..!
నా కలల వనానికి వసంతమెళ్ళిపోయిందేమో
పూతలు పిందెలు మెక్కే కొయిల్లకు తావులేదేమో
ఉవ్వెత్తున పొంగే నా ఏరు ఎండిపోతోందేమో
నువ్వు నావై నాతో ఏ దరికి చేరలేవేమో..!
బాహువుల బిగువు సడలుతుందేమో..
అలవిగాని నీ బరువిక నే మోయలేనేమో
జాగ్రత్తగా క్రిందకి దిగుతావా నా ప్రియకామనా
ఒక్కసారి మరొక్కసారి అపరిచితులమవుదాం..!
పుల్లటి పండ్లనీ ఓడుమద్దెల్లనీ
ముతక మాటలు మొదలెట్టకముందే
కోర్కెల కోతులూ ఇకచాలు మీరూ దయచేయరూ
మళ్ళీ ఇంకోసారి అపరిచితులమవుదాం! ★★★

## ప్రేమ తప్పదు
## చందలూరి నారాయణ రావు

ఆ ఒక్క మాట
నాలో పెట్టిన పుటానికి
సెగలు తొడిగిన అర్థాలను
రవ్వలు రువ్విన బంధాన్ని
మనసు మిరుమిట్లను
మడతేసి ఎంత అడుక్కి నెట్టినా
ముఖానికి తలుపులు మూసి తరిమినా..
నాలుక నడి వీధిలో
పరుష పదజాలపు పలకల కింద
చీకటితో అర్థాన్ని పూడ్చి సమాధి చేసినా
నిర్లక్ష్యపు నిప్పులలో
ఆశను కాల్చి మసి చేసినా
కసిగా కళ్ళు దృశ్యాలను
కసిరి నేలకేసికొట్టినా...
ఆ ఒకే ఒక్క మాట
రక్తాన్ని ఏతమేసి తొడటం
మానలేదు...
ఎర్రగా తడిసిన ఏ జ్ఞాపకం ఆరడం లేదు.
నిటారైన ప్రతి అనుభవం కింద
వెచ్చని శ్వాస వేర్లు పాకి
పచ్చగా ధ్యాస దార్లు వెతుకడం ఆగలేదు.
మనసును ఒడిసిపట్టి
భావాలని వడగొట్టి
బతుకును వెలకట్టి
జీవితమంతా జతకట్టి
ప్రేమకు కట్టుబడక తప్పడంలేదు.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

కనులు తెరచి మేల్కొనిన యా క్షణమునుండి
తోడుగానుండి నన్ను కాపాడుచుండు
నిదుర పోద్రోలి చెంతనె నిలచి యుండి
మార్గదర్శకుడై నన్ను మలచుచుండు

అందురతనినందరు సహస్రాంశుడంచు
అన్ని కరములతో మననాదుకొనును
ప్రాణమును నిల్పు సంతతప్రాణసఖుడు
జీవితమ్మెల్ల సాకు నెచ్చెలియతండు

చందురుడు తారలును నాకు సన్నిహితులె
కాని దినమెల్ల నాతోడ గడపలేరు
నిర్మలానందమున ముంచి నిదుర పుచ్చి
అంతలోపల కనుమరుగౌదురెపుడు

కమలమిత్రుని స్పర్శ నాకమలవరము
తెలియునాతడు చేరువ నిలిచినపుడు
భీషణుండై యొకపరి నొప్పింపనగును
సత్వరమ్ముగ శాంతించి సౌమ్యుడగును

ఎవరు మిత్రులు నాకన్న నెందరో మ
హానుభావులు గలరు నా యాత్మసఖులు
వారలందర నా కనులార జూచు
పరమభాగ్యప్రదాత యా తరణి యొకడె

COMMENTS